# ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో

- తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు నిరంతరం ప్రయత్నించాలి
- మెట్రో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**మనతెలంగాణ/హైదరాబాద్:** ఫ్యూచర్ సిటీ వరకు మెట్రోను విస్తరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అందుకు అవసరమైన తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మెట్రో విస్తరణపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సిఎంతో పాటు సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాస రాజు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సిఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండి ఎన్వీఎస్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిని ముఖ్యమంత్రి ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందని, ఇప్పటికే ఢిల్లీలో అధికారులను కలిసి



సంప్రదింపులు జరిపినట్లు అధికారులు వివరించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు (36.8 కి.మీ.), రాయదుర్గం టు కోకాపేట నియోపొలిస్ (11.6 కి.మీ.), ఎంజీబిఎస్ టు చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్ టు పటాన్‌చెరు (13.4 కి.మీ.), ఎల్బీ నగర్ టు హయత్ నగర్ (7.1 కి.మీ.)లు మొత్తం 76.4 కి.మీ.ల విస్తరణకు రూ.24,269 కోట్ల అంచనాలతో డిపిఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించింది. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చెరి సగం నిధులు భరించేలా జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్టు చేపట్టేలా ప్రతిపాదనలు తయారు చేసింది.

## ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రోరైల్

కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు నిరంతరం ప్రయత్నించాలని, అనుమతులు రాగానే పనులు ప్రారంభించేందుకు సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలోని యంగ్‌ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు 40 కిలోమీటర్ల వరకు ఈ మెట్రోను విస్తరించేందుకు కొత్త ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను సిఎం రేవంత్ ఆదేశించారు. దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్ నగర విస్తరణ అవసరాల దృష్ట్యా మెట్రోను మీర్ఖాన్‌పేట వరకు పొడిగించాలని సిఎం చెప్పారు. అందుకు అవసరమయ్యే అంచనాలతో డిపిఆర్‌ను తయారు చేసి కేంద్రానికి పంపించాలని ముఖ్యమంత్రి సూచించారు. హెచ్ఎండిఏతో పాటు ఎఫ్ఎస్డీఏను (ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ)ని ఈ రూట్ మెట్రో విస్తరణలో భాగస్వాములను చేయాలని సిఎం రేవంత్ సూచించారు.

మన తెలంగాణ
Sat, 12 April 2025
https://epaper.manatelangana.news/c/77161551